## క్లుప్తంగా

### హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : దేవుని కడపలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం హుండీల సొమ్ము లెక్కింపు చేపట్టారు. దేవదాయశాఖ నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు సూపరింటెండెంట్ రమణమ్మ వచ్చారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో హుండీల ఆదాయాన్ని లెక్కింపు నిర్వహించారు. గత నవంబరు 28 నుంచి ఇప్పటివరకు హుండీల ద్వారా రూ. 63,945 లభించిందని ఈఓ శ్రీధర్ తెలిపారు.

- మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో కూడా శుక్రవారం హుండీ సొమ్ము లెక్కింపు నిర్వహించారు. గత నవంబరు 28 నుంచి ఇప్పటివరకు ఈ హుండీల ద్వారా రూ.19,579 లభించినట్లు ఈఓ తెలిపారు.

### 12న వైవీయూ వ్యవస్థాపక కళాశాల దినోత్సవం

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కళాశాల దినోత్సవం ఈనెల 12వ తేదీ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి వెల్లడించారు. శుక్రవారం విభాగాధిపతులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ 2, 4 సెమిస్టర్ల పరీక్షల తేదీల నిర్ణయం, సిలబస్ ఏ మేరకు అయిందనే విషయంపై హెచ్ఓడీలను అడిగి తెలుసుకున్నారు. మిగులు సిలబస్ ను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు డిపార్టుమెంట్ హెచ్ఓడీలు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నాగరాజుపేట, రవి థియేటర్, అల్మాస్ పేట, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాలను ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందజేశారు. అల్మాస్‌పేటలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ తనిఖీ చేసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను సమీక్షించారు. అనంతరం జిల్లా పరిషత్ ఆవరణంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. అక్కడ ప్రజలతో మాట్లాడుతూ భోజనం నాణ్యత, రుచి సేవలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అవసరమైన మార్పుల గూర్చి సిబ్బందికి తెలిపారు.

### నిరంతరం శ్రమిస్తే చిత్రాకారులుగా రాణిస్తారు



చిత్రకారుడు దామెర్ల రామారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: చిత్రకారుడిగా రాణించాలనే తపనను అణువణువునా నింపుకొని నిత్యం శ్రమిస్తే ప్రముఖ చిత్రకారుల జాబితాలో మీరు ఉంటారని యోగివేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్టమొదటి చిత్రకారుడు దామెర్ల రామారావు జయంతి కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఫైన్ ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

### ఐదు రోజుల పనిదినాలను వర్తింపజేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగ యూనియన్ల నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఐదు రోజుల పనిదినాలను వర్తింపజేయాలని కడపజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు దేశంలోని అన్ని ప్రధాన నగరాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులలో తక్షణమే అన్ని క్యాడర్లలో శాశ్వత నియామకాలు చేపట్టాలని కోరారు. ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ యూనియన్ నాయకులు రాజశేఖర్, కిరణ్, ఎస్‌బీఐ ఆఫీసర్స్ రీజినల్ సెక్రటరీ రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు గరుడయ్య, ఎల్‌ఐసీ నాయకులు రఘునాథరెడ్డి, శ్రీనివాసులు, ఏపీజీబీ నాయకులు జగదీష్, రాహుల్, అన్ని బ్యాంకుల ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు



రిమ్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలకు సంబంధించి కేక్ కట్ చేస్తున్న అధికారులు



సత్కారం అందుకుంటున్న ఇంటాక్ మహిళా సభ్యులు




మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి

కడప అర్బన్: సమాజంలో మహిళలు అని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి ప్రత్యేక స్థానం ఉందని, ఎల్లవేళలా వారిని గౌరవించాలని కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డిప్యూటీ కలెక్టర్ యు. రంగస్వామి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డాక్టర్ అసోసియేషన్ రిమ్స్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలను కడప ప్రభుత్వ వైద్యశాల కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ, జీఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సురేఖ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి మాట్లాడుతూ సమాజంలో ప్రతి రంగంలోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. ప్రధానంగా కడప రిమ్స్ లో వైద్య రంగంలో వైద్యులుగా, అధికారులుగా, వైద్య సిబ్బంది గా విధులను నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. అడిషనల్ డీఎంఈ, జి.ఎం.సి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సురేఖ మాట్లాడుతూ మహిళలు అనేక విజయాలు సాధిస్తున్నారన్నారు. కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులే ఎక్కువ మంది ఉన్నారన్నారు. ఈ ఏడాది హెల్త్ యూనివర్సిటీ స్థాయిలో కడప రిమ్స్ జనరల్ మెడిసిన్ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ విరాజిత టాపర్ గా నిలిచి ప్రత్యేక స్థానాన్ని అందుకున్నారన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకల సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సురేఖను, హెచ్వోడీ లను, పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ విరాజిత ను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సి ఎస్ ఆర్ ఎం ఓలు డాక్టర్ ఎస్ ఆర్ రాజేశ్వరి, డాక్టర్ గీత, డాక్టర్ సునీత, గైనకాలజీ హెచ్ఓడి డాక్టర్ లక్ష్మీసుశీల, మైక్రోబయాలజీ హెచ్ ఓ డి డాక్టర్ నాగశ్రీలత, డాక్టర్ రజిని, వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### స్త్రీ పాత్ర వీరోచితమైనది

కడప కల్చరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, జన విజ్ఞాన వేదిక, పీఎంఎఫ్ సంస్థల ఉమ్మడి ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీ పాత్ర వీరోచితమైనదని, తాను ఎన్ని కష్టాలు అనుభవించినా దేశం కోసం, తన వారికోసం ఆనందంగా భరించి అనుకున్నది సాధించే పట్టుదల మహిళలకు ఉంటుందన్నారు. సమాజం సజావుగా నడవాలంటే స్త్రీ, పురుషులు సమాన బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ మానవ జాతి మనుగడ మహిళపైనే ఆధారపడి ఉందని, ఆమె త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. డాక్టర్ ఆదూరి శకుంతల మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా ధృడత్వాన్ని మహిళలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళ లేని మానవ లోకాన్ని ఊహించుకోలేమన్నారు. ఉపాధ్యాయ సంఘ నేత శ్రీనివాసులురెడ్డి, వైవీయూ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ ఆడిటర్ షరీఫ్‌ఖాన్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, సైకాలజిస్టు ఓపీ రెడ్డి, మారుతిప్రసాద్, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి తదితరులు కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన కేకును ఇంటాక్ మహిళా సభ్యులందరూ ఆచార్య పుత్తా పద్మతో కలిసి కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఇంటాక్ మహాసభ సభ్యులందరినీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

### ముందుకు సాగాలి

కడప ఎడ్యుకేషన్: నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని మౌలిక వసతులను వినియోగించుకుని ముందుకు సాగాలని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఎవైనా సమస్యలుంటే 1098, 181 హెల్ప్‌లైన్‌లను వినియోగించుకోవాలన్నారు. అలాగే వన్‌స్టాప్ సెంటర్, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి వంటి వాటి గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో సాంకేతిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు డాక్టర్ కల్పన, డాక్టర్ సావిత్రి, అనిత, షాహిన్, కృష్ణవేణి, రాధిక, రేణుక, సునిత, లవణ్య, అపర్ణదీప్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ విశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చు

– జాయింట్ కలెక్టర్ అదితిసింగ్




మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప ఎడ్యుకేషన్: ఆత్మ విశ్వాసంతో పనిచేస్తే కానిది ఏమీ ఉండదని మహిళలంతా ఆత్మ విశ్వాసంతో పని చేసుకుంటూ అడ్డంకులను అధికమించి ముందుకు సాగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సూచించారు. శుక్రవారం కడప నగర శివార్లలోని కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హాజరై మాట్లాడారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి , కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మహిళలు చైతన్యం కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రత్నమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్న కడప ప్రభుత్వ కోటిరెడ్డి మహిళా కళాశాల అధ్యాపకురాలు విజయలక్ష్మిని శుక్రవారం జనం కోసం సేవా సాంస్కృతిక విద్య క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష , ఖాదర్‌బాష పాల్గొన్నారు.



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

### ఊరేగింపును అడ్డుకోవడం తగదు

కడప కల్చరల్ : ఈనెల 4న రాయచోటిలో శ్రీ వీరభద్రస్వామి ఆలయ పార్వేట ఊరేగింపును ఓ వర్గం వారు అనవసరంగా అడ్డుకుని లేనిపోని ఉద్రిక్తతలు రెచ్చగొట్టారని, ఇది హిందువుల సహనాన్ని పరీక్షించినట్లేనని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి అన్నారు. పాత బస్టాండులోని శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయ వద్దగల వీహెచ్‌పీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాయచోటి గ్రామం ఏర్పటినప్పటి నుంచి వీరభద్రస్వామి ఊరేగింపులు నిర్వహిస్తున్నామని, ఇంతవరకు ఎప్పుడూ లేని అభ్యంతరాలు ఇటీవల తలెత్తుతున్నాయని, సాక్షాత్తు పోలీసు అధికారులు వత్తాసు పలకడం బాధిస్తోందన్నారు. ఈ సమావేశంలో ఆలయాలు, మందిరాలు, మఠాల విభాగం నేత విజయ్‌భట్టర్, ప్రతినిధి శ్రీధర్‌శర్మ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు మాలినిరెడ్డి, వీహెచ్‌పీ ఇతర విభాగాల ప్రముఖులు పాల్గొన్నారు.

### ఘనంగా యోగి నరసింహ స్వామి ఆరాధన



గెలుపొందిన ఎద్దుల యజమానికి బహుమతి అందజేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్/చింతకొమ్మదిన్నె: నగర శివార్లలోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వెలసిన చిన్నపల్లె యోగి శ్రీ నరసింహ స్వామి 217వ ఆరాధన ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు పూల పాన్పు సేవను నిర్వహించారు. ఆరాధన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నది. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. అనంతరం గెలుపొందిన ఎద్దుల యజమానులకు రవీంద్రనాథ్ రెడ్డి బహుమతులను ప్రధానం చేశారు.

### చిన్నచౌక్‌లో చోరీ

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహాలక్ష్మినగర్‌లో ఈనెల 6వ తేదీన రాత్రి రాజశేఖర్‌రెడ్డి, తన కుటుంబసభ్యులతో ఇంటిలో నిద్రించారు. దుండగులు ఇంటిలోపలకు ప్రవేశించారు. బాధితుడు నిద్రిస్తున్న గదిని వదిలేసి మరో గదిలోకి వెళ్లారు. అక్కడ బీరువాను పగులగొట్టి అందులోని 9 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

### అన్నింటా ముందుండాలి

కడప ఎడ్యుకేషన్: అంధత్వాన్ని జయించి అంధులు అన్నింటా ముందుండాలని జిల్లా సైన్సు అధికారి, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేపరాల ఎబినైజర్ ఎమ్మానియేలు పేర్కొన్నారు. శుక్రవారం కడప శంకరాపురంలోని అంధుల పాఠశాలలో స్కూల్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంధుల ఆరాధ్యదైవం బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధం



మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దైనందిన జీవితంలో వాణిజ్య ప్రాంతాలు, పరిశ్రమలు, ఇంధన పైప్ లైన్, పలు రసాయనాలు, ఉత్పాదక కేంద్రాల్లో ఊహించని ఎలాంటి విపత్కర ప్రమాదాలనైనా ఎదుర్కొనేందుకు జిల్లా విపత్తుల నిర్వహణ, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉన్నామని కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా.. శుక్రవారం కడప నగర శివారు ప్రాంతం బలిజపల్లి పరిధిలోని హెచ్‌పీసీఎల్ (హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్)కు సంబంధించిన వీడీపీఎల్ (విజయవాడ – ధర్మపురి పైప్ లైన్) చైనేజ్ పైప్ లైన్ – 391 వద్ద నిర్వహించిన ఈఆర్‌డీఎంపీ (ఎమెర్జెన్సీ రెస్పాన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్) ఆఫ్ సెట్ మాక్ డ్రిల్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. డ్యామేజ్, లీకేజీ సమయంలో ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టాలి అన్న విషయంపై జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ, ఎస్‌డీఆర్ఎఫ్, హెచ్‌పీసీఎల్, సేఫ్టీ ఆఫీసర్ అధికారుల పర్యవేక్షణలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి హాజరై మాట్లాడారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ కలకడ బూస్టర్ స్టేషన్ చీఫ్ స్టేషన్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు, కడప డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓబయ్య, మేనేజర్ పి. శ్రీకాంత్, సీనియర్ మేనేజర్లు జె. నాగార్జున రావు, గౌతమ్ కుమార్, హెచ్‌పీసీఎల్ అధికారులు, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణ, హెచ్‌పీసీఎల్ డీజీఎం ఓబయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం న్యాయవాదుల నియామకం

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ 'లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం' (ఎల్ఏడీఎస్) న్యాయవాదులను నియమించారు. ఈ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎస్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లుగా ఎం.శాంత, ఎం.వినయ్‌కుమార్, ఎం. చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లుగా పి.మనోహర్, ఎం. సౌజన్య, ఎస్. నీలకంఠేశ్వర్‌రెడ్డి, షేక్ అక్బర్‌అలీ, ఏ.ఎస్ రవితేజ, పి. ప్రవీణ్‌కుమార్‌లను నియమించారు. వీరు కోర్టులలో లీగల్ ఎయిడ్‌కు సంబంధించిన క్రిమినల్ కేసులను పరిష్కరిస్తూ ఉంటారు. న్యాయవాదిని నియమించుకోలేని, ఆర్థిక స్తోమత లేని వారు వీరిని సంప్రదించి ఉచితంగా న్యాయవాదిని పొందవచ్చును. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చు.

### ఆధ్యాత్మిక జీవితమే పరలోకానికి మార్గం



మాట్లాడుతున్న క్రీస్తు సంఘం దైవ జనులు కేకే సుధీర్

కడప కల్చరల్ : ఆధ్యాత్మిక జీవితమే పరలోకానికి మార్గమని తిరుపతికి చెందిన క్రీస్తు సంఘం దైవ జనులు కేకే సుధీర్ అన్నారు. శుక్రవారం కడప నగరం కృపా కాలనీలో పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దైవ సేవకులు వి. సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. అనంతరం దైవ సేవకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సేవకులు కిరణ్, రజినీకాంత్, రవితేజ, దానియేలు, లక్ష్మి నారాయణ, యం .జ్ఞానేంద్ర, జాన్సన్ వేమయ్య పాల్గొన్నారు.

### రేపు శ్రీ వాసవాంబ ఆలయ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కార్యక్రమ నిర్వాహకులు సతీష్

కడప కల్చరల్ : శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయాన్ని పునః నిర్మించిన అనంతరం కుంభాభిషేకం నిర్వహించాల్సి ఉందని, దానికి ముందు శాస్త్రం ప్రకారం ఆదివారం వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు సతీష్, చింతకుంట పుల్లయ్య తెలిపారు. శుక్రవారం అమ్మవారిశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 144 సంవత్సరాల చరిత్రగల కడప అమ్మవారిశాలను 12 సంవత్సరాల క్రితం పునః నిర్మించామని, ప్రస్తుతం ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఒక్కరోజు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ పునః నిర్మాణాన్ని శృంగేరీ పీఠాధిపతులు స్వయంగా నిర్వహించారని, ఈ కార్యక్రమం కూడా వారి సూచనల మేరకే జరుగుతోందన్నారు. ఇందులో ప్రత్యేక కార్యక్రమంగా ఆలయం వెలుపల మినీ పుష్కరిణి (నీటి తొట్టి) నిర్మించామని, అందులో నీళ్లు నింపి ప్రత్యేకంగా తయారు చేయించిన తెప్పపై అమ్మవారిని ప్రతిష్ఠించి విహరింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, అర్చకులు కృష్ణమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### 'జనరిక్' బ్రాండెడ్ మందులతో సమానం

కడప రూరల్: జనరిక్ మందులు బ్రాండెడ్ మందులతో సమానం. తక్కువ ధరకు లభించే నాణ్యమైన జనరిక్ మందులను వాడాలని వైద్యాధికారులు అన్నారు. ఏడవ జన్ ఔషిధి దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాగరాజుపేటలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఔషధ తనిఖీ అధికారి మాధవి ప్రధానమంత్రి జన ఔషిధీ మందుల షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్, ఉబేదుల్లా, ఎపడమాలజిస్ట్ ఖాజామొహిద్దీన్, వెంకటరెడ్డి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.




# మహిళా... నీకు వందనం

కడప కల్చరల్ : నేటి తరం మహిళ అన్ని రంగాల్లో పురుషుడితో సమానంగా అభివృద్ధి సాధిస్తోంది. ఒక దశలో పురుషుల కంటే ఎక్కువగానే దూసుకుపోతోంది. హిందూ పురాణాల్లో కూడా మహిళకు ఎంతో ప్రాధాన్యత కనిపిస్తోంది. త్రిమూర్తుల్లో ... విష్ణుమూర్తి లక్ష్మిదేవిని హృదయంలో నిలుపుకోగా, శక్తిస్వరూపిణి పార్వతీమాతకు ఈశ్వరుడు సగం శరీరం అర్పించగా, బ్రహ్మ చదువుల తల్లి సరస్వతీమాతను నాలుకపై ప్రతిష్ఠించుకున్నారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

– ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల్లో భాగంగా నేటి మహిళకు విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం బాలుర కంటే బాలికలే ఎక్కువగా విద్యను అభ్యసిస్తున్నారు. పోటీ పరీక్షల్లో కూడా బాలికలదే అగ్రస్థానం. అట్టడుగు పనుల నుంచి ఇతర గ్రహాలకు వెళ్లడంలో కూడా మహిళ తెగువ చూపుతోంది. ఆమె నేర్చుకోలేని విద్య లేదు. చేయని పని లేదు. అత్యంత కష్టమైన బస్సు కండక్టర్ మొదలుకొని రైళ్లు, విమానాలు నడిపే స్థాయికి ఎదిగి ఇతరులకు స్ఫూర్తినిస్తోంది. దేశంలోని మహిళా అధికారుల సంఖ్య పురుషులతో పోటీ పడుతుండడం గమనార్హం.

మహిళా దినోత్సవం గురించి..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం 20వ శతాబ్దంలో మొదలైంది. ఉత్తర అమెరికా, యూరప్‌లోని కార్మిక ఉద్యమాల ద్వారా దీనికి పునాదులు పడ్డాయి. మొదటి జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్‌లో 1909 ఫిబ్రవరి 28న నిర్వహించారు. న్యూయార్క్‌లో సోషలిస్టు మహిళలు, వస్త్ర కార్మికులు తక్కువ పనిగంటలు, అధిక వేతనాలు, ఓటుహక్కు డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. అలా మహిళా దినోత్సవం ప్రారంభమైంది. 1910లో కోపెన్ హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో క్లారా జట్కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతిపాదించగా ఆమోదింపబడింది. ఈ దినోత్సవాన్ని మొదటిసారిగా 1911లో అనేక యూరోపియన్ దేశాల్లో నిర్వహించుకున్నారు. 1975లో ఐక్యరాజ్య సమితి అధికారికంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. 1977లో ఐక్య రాజ్య సమితి మార్చి 8న మహిళా హక్కులు, ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా ప్రకటించాలని ఆహ్వానించింది. దాంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8న నిర్వహించుకోవడం మొదలుపెట్టారు. 2025 మహిళా దినోత్సవాన్ని క్రియాశీలత అనే అంశంపై నిర్వహించుకుంటున్నారు. మహిళలు, బాలికల హక్కులు సాధికారత, సమాన అవకాశాలు, వివక్ష తొలగింపు తదితర అంశాలపై సంస్థలు విశేషమైన కృషి చేయనున్నాయి.



















